
ప్రజాశక్తి
ఆదివారం 9 నవంబర్ 2025 5
పార్వతీపురం మన్యం



హోరాహోరీగా చదరంగం పోటీలు



సీతానగరం : మండలంలోని జోగింపేట గిరిజన సంక్షేమ ప్రతిభా పాఠశాల ఆవరణంలో మినీ ఆడిటోరియంలో శనివారం రెండో రోజు రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు హోరా హోరీగా కొనసాగాయి. అండర్ 14, 17, 19 విభాగాల్లో విద్యార్థులు పోటీ పడుతున్నారు. ఈ పోటీలు ఆదివారంతో ముగుస్తున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎస్.మురళి తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి జాతీయ స్థాయిలో ఎంపిక జరుగుతుందన్నారు.

ఒకే గది... ఐదు తరగతులు

- అందులోనే వంట సామగ్రి
- ఇదీ బియ్యాలవలస ఎంపిపి మోడల్ పాఠశాల దుస్థితి
- గ్రామస్తుల దాతృత్వంతో రేకుల షెడ్ నిర్మాణం



బియ్యాలవలస ఎంపిపి మోడల్ స్కూల్

ప్రజాశక్తి -కురుపాం

మన్యంలో విద్యను అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఇటు పాలకులు, అటు అధికారులు చెప్పడం తప్ప ఆచరణలో అంతా బూటకమనేది మండలంలోని బియ్యాలవలస మండల పరిషత్ ప్రాథమిక మోడల్ పాఠశాల పరిస్థితి నిదర్శనం. ఈ పాఠశాలను అధికారులు ఆర్భాటంగా మోడల్ పాఠశాలగా మార్చే తప్ప అందుకు అనుగుణంగా మౌలిక సౌకర్యాలు కల్పనను పట్టించుకోలేదు. దీంతో ఈ పాఠశాలల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవస్థలు తప్పడంలేదు. మండలంలోని బియ్యాలవలస మండల పరిషత్ ప్రాథమిక మోడల్ పాఠశాలలో విద్యార్థుల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఈ పాఠశాలలో 1 నుంచి ఐదో తరగతి వరకు 42 మంది విద్యార్థులు ఉన్నారు. నలుగురు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. అయితే ఈ పాఠశాలలో కేవలం ఒకే గది ఉండడంతో అన్ని తరగతుల విద్యార్థులు అదే గదిలో పాఠాలు వినాల్సి వస్తోంది. అంతేకాకుండా మధ్యాహ్న భోజనం వంట సామాగ్రికి కూడా అదే గదిలో ఉంచడం గమనార్హం. మోడల్ పాఠశాలగా ప్రకటించిన అధికారులు అందుకు అనుగుణంగా ఐదు తరగతి గదులు, ఇతర మౌలిక వసతులు కల్పించాల్సి ఉన్నా అవేమీ లేవు.

ఈ పాఠశాల పరిస్థితిపై ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నోసార్లు విన్నవించినా ఫలితం శూన్యం. పాఠశాలలకు అదనపు భవనం, మౌలిక వసతులు కల్పించాలని పలుమార్లు వినతి పత్రాలు అందించినా పట్టించుకున్న దాఖలాల్లేవు. దీంతో విసుగు చెందిన గ్రామస్తులంతా స్వచ్ఛందంగా ముందుకొచ్చి, కొంత నగదు సేకరించి, విద్యార్థుల కోసం ఒక రేకుల షెడ్డు, తరగతి గది, వంటగది నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తు మాట్లాడుతూ అలాగే గతంలో నాడు-నేడు కింద ఈ పాఠశాలలో మౌలిక సదుపాయాలు, ఇతర సౌకర్యాల నిమిత్తం రూ.12లక్షలు మంజూరైనా పనులు సక్రమంగా చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమ పిల్లల భవిష్యత్తు కోసం పాఠశాల సమస్యను ప్రభుత్వం, విద్యాశాఖ ఉన్నతాధికారులు గమనించి శాశ్వత భవనాలు, అవసరమైన మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తక్షణమే చేపట్టాలని కోరుతున్నారు.



ఒకే గదిలో ఐదు తరగతుల విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయులు

పవర్ ప్రాజెక్టు అనుమతులు రద్దు చేయాలి

ప్రజాసంఘాల డిమాండ్ • 22న దుగ్గేరులో సమావేశం



పవర్ ప్రాజెక్టు అనుమతులు రద్దు చేయాలని కోరుతూ కరపత్రాన్ని విడుదల చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి - పార్వతీపురం

మక్కువ మండలం దుగ్గేరు కేంద్రంగా టిడిపి కూటమి ప్రభుత్వం ప్రకటించిన పంప్డ్ హైడ్రో ప్రాజెక్టు అనుమతులు వెంటనే రద్దు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం, ఎపి రైతు సంఘం, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేశాయి. శనివారం స్థానిక గిరిజన భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొల్లి గంగు నాయుడు మాట్లాడారు. దుగ్గేరులో పవర్ ప్రాజెక్టు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.25 వేల కోట్లతో 2వేల మెగావాట్ల పవర్ ప్రాజెక్టను ఏర్పాటు చేసేందుకు చింతా గ్రీన్ ఎనర్జీ కంపెనీకి అనుమతులు మంజూరు చేసిందన్నారు. ఇందుకు అవసరమైన నీటిని తోటపల్లి, వెంగళరాయ సాగర్ ప్రాజెక్టుల నుంచి 24 మిలియన్ క్యూబెక్ మీటర్ల నీటిని సరఫరా చేయడానికి రాష్ట్ర మంత్రివర్గం ఇటీవల ఆమోదం తెలిపిందని చెప్పారు. దీనివల్ల ఆదివాసీల జీవితాలు నాశనమవ్వడమే కాకుండా ఈ ప్రాంత రైతులకు సాగునీరు లేకుండా పోతుందని తెలిపారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాజెక్టులు, మైనింగ్‌ల పేరుతో ఆదివాసీ ప్రాంతాలను పూర్తిగా కార్పొరేట్ పెట్టుబడిదారుల చేతుల్లోకి పెట్టే విధానాలు అవలంభిస్తున్నాయని చెప్పారు. అందులో భాగంగా జార్ఖండ్, ఛత్తీస్గఢ్ రాష్ట్రంలో లక్షలాది ఎకరాల భూమిని బొగ్గు గనుల కోసం కార్పొరేట్లకు ఇచ్చేశారని తెలిపారు. అలాగే మన రాష్ట్రంలో అనంతగిరి జిల్లాలో నవయుగ పవర్ ప్రాజెక్టు కోసం కూడా వేలాది ఎకరాల భూములు కేటాయించారని తెలిపారు. మన్యం జిల్లాలో బోడికొండ, బడిదేవరకొండ, కారాడ వలస కొండల్లో ఉన్న గ్రానైట్ తవ్వకాల పేరుతో పెట్టుబడుదారులకు రైతుల భూములపై అనుమతులు ఇచ్చారని చెప్పారు. ప్రత్యామ్నాయ పద్ధతుల ద్వారా విద్యుత్తు ఉత్పత్తి చేయకుండా గిరిజన బతుకులు నాశనం చేయడానికి హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌లను ఏర్పాటు చేస్తోందని విమర్శించారు. పవన, సౌర విద్యుత్తు ఉత్పత్తిపై దృష్టి పెట్టకుండా పర్యావరణ ధ్వంసానికి కుట్ర చేస్తోందని చెప్పారు. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పవర్ ప్రాజెక్టులకు ఇచ్చిన అనుమతులపై రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన ప్రాంతాల్లో ప్రజలు పోరాడుతున్నారని, సాలూరులో శిఖపరువులో అక్రమ మైనింగ్ చేస్తే గిరిజనులు పోరాడే అడ్డుకున్నారని, కురుకుటి, కర్రివలస ప్రాంతాల్లో అదాని పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి ముందుకు వస్తే ప్రజలు పోరాడే అడ్డుకున్నారని తెలిపారు. దుగ్గేరు కేంద్రంగా ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పెట్టే ప్రాజెక్టును ప్రజలంతా చైతన్యంతో అడ్డుకోవాలని, దీని కోసం ఈనెల 22న దుగ్గేరులో జరగనున్న సమావేశానికి ఈ ప్రాంత ప్రజలంతా హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు మర్రి శ్రీనివాసరావు, రెడ్డి ఈశ్వరరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బంటు దాసు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.రమణమూర్తి, బి.అప్పారావు, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.రామస్వామి, నాయకులు, ఎస్ వై నాయుడు పాల్గొన్నారు.



నీలవలస జలపాతం వద్ద సందడి చేస్తున్న కలెక్టర్, అధికారులు

పర్యాటకులకు కొత్త గమ్యస్థానం

నీలవలస జలపాతం : కలెక్టర్

ప్రజాశక్తి - పాచిపెంట

పర్యాటకులకు కొత్త గమ్యస్థానం మండలంలోని నీలవలస జలపాతమని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సుందరమైన నీలవలస జలపాతం పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోందన్నారు. దట్టమైన అటవీ ప్రాంతంలో, కొండల నడుమ నెలకొన్న ఈ జలపాతం ప్రకృతి అందాలను ఆస్వాదించే వారికి ఒక ప్రశాంతమైన వాతావరణాన్ని అందిస్తుందని చెప్పారు. జిల్లా పర్యటనలో భాగంగా నీలవలస జలపాతాన్ని శనివారం ఆయన సందర్శించారు. అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన కలెక్టర్ యువతకు, అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రకృతి పర్యాటకులు, సాహస యాత్రికులు, ఛాయాగ్రాహకులు నీలవలస జలపాతాన్ని సందర్శించి, ఇక్కడి ప్రశాంతమైన వాతావరణాన్ని అనుభూతి చెందుతారని తెలిపారు. ఇంతటి ప్రకృతి సహజ సిద్ధమైన జలపాతానికి పర్యాటకులు విశేషంగా వచ్చేలా అన్ని మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఇక్కడికి విచ్చేసే సందర్శకులు ఈ ప్రదేశం సహజత్వాన్ని కాపాడేలా చూడాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని యువతకు సూచించారు. అనంతరం పిల్లల కోసం రాళ్లతో ఏర్పాటుచేసిన స్విమ్మింగ్ పూల్ ను పరిశీలించి దాన్ని శుభ్రపరిచే కార్యక్రమంలో యువత, అధికారులతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్వతీపురం సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, సీతంపేట ఐటిడిఎ పిఒ పిఎస్ జగన్నాథ్, ఎంపిపి చైర్మన్ ముఖి సూర్యనారాయణ, తహశీల్దార్ డి.రవి, ఎంపిడిఒ బివిజె పాత్రో, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించాలి : జెసి

ప్రజాశక్తి - పార్వతీపురం

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారికి ఉన్నత వేదికలపై అవకాశాలు కల్పించడమే ఈ క్రీడల ప్రధాన ఉద్దేశ్యమని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి తెలిపారు. క్రీడలు కేవలం విజయం కోసం మాత్రమే కాదని, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి ఉపయోగపడతాయని ఉద్ఘాటించారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించాలని ఆకాంక్షించారు. జన్ జాతీయ గౌరవ దివాస్ వేడుకల్లో భాగంగా పట్టణంలోని బెలగాంలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి ఆటలు, క్రీడలు ఐడిడిఎ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి జెసి ముఖ్య అతిధిగా పాల్గొని ఆటలను, క్రీడలను లాంఛనంగా ప్రారంభించారు. ఆర్చరీ, జావలిన్ త్రో, వాలీబాల్, కబడ్డీ, వక్తృత్వ, వ్యాస రచన పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారులను, కోచ్‌లను, పిఇటిలు, పీడీలను జెసి అభినందించారు. అనంతరం వాలీబాల్ క్రీడలో పాల్గొని జెసి కాసేపు క్రీడాకారులతో కలిసి ఆడారు. క్రీడలతో విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం, ఉత్తేజంతో పాటు ఆరోగ్యంగా ఉంటారని, కావున ప్రతి విద్యార్థి ఏదో ఒక క్రీడ, ఆటల్లో నైపుణ్యాన్ని పెంపుందించుకోవాలని అన్నారు. జిల్లాస్థాయి విజేతలు రాష్ట్ర స్థాయిలో కూడా పతకాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే వ్యాసరచన, వక్తృత్వ పోటీలను జేసీ తిలకించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ పి.మురళీధర్, ఆర్.కృష్ణవేణి, క్రీడాకారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీ పోటీలను తిలకిస్తున్న జెసి యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సీతంపేట: స్థానిక ఐటిడిక పరిధిలోని గిరిజన సంక్షేమ పాఠశాలల విద్యార్థులకు శనివారం ఐటిడిఎ జిల్లాస్థాయి గేమ్స్ అండ్ స్పోర్ట్స్ నిర్వహించారు. ఈ క్రీడల్లో ఐటిడిఎ పరిధిలో గల మూడు క్లస్టర్ల నుంచి గిరిజన ఆశ్రమ, సంక్షేమ పాఠశాలల నుంచి సుమారు 150 మంది విద్యార్థిని, విద్యార్థులు హాజరయ్యారు. కబడ్డీ , వాలీబాల్, ఆర్చరీ, జావెలిన్ త్రో విభాగాల్లో పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులు విశాఖపట్నంలో జరుగు రాష్ట్రస్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో ఐటిడిఎ స్పోర్ట్స్ ఇన్‌ఛార్జ్ జాకబ్ దయానంద్, పీడీలు, పిఇటిలు పాల్గొన్నారు.

11 మందితో తోటపల్లి దేవస్థానం ధర్మకర్తల మండలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని తోటపల్లి గల వెంకటేశ్వర స్వామి, కోదండరామ స్వామి దేవస్థానాల ట్రస్ట్ చైర్మన్, సభ్యులుగా ప్రభుత్వ నియామక పత్రాన్ని ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి గుమ్మలక్ష్మీపురంలో గల తన క్యాంప్ కార్యాలయంలో శనివారం విడుదల చేశారు. మార్కొండ పకీరునాయుడు, రెడ్డి రాజేశ్వరి, శంబంగి.పకీరునాయుడు, గరుగుబిల్లి మీనా, వావిలపల్లి పద్మజ, ముత్యచర్ల, ఆరిక.జానకి, బొమ్మాలి సుభాషిని, భగవాన్ వరప్రసాద్ మిశ్రో,(శిస్టు.లక్ష్మి, మరడాన కృష్ణంనాయుడు, వర్జుల.వెంకట అప్పలాచార్యులు(అర్చక మాజీ అఫీషియో మెంబర్) లు ప్రభుత్వం నియమించింది. ఈ సభ్యులంతా తోటపల్లి దేవస్థానం అభివృద్ధికి కృషిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి శ్రీనివాసరావు. నూతన చైర్మన్‌గా నియమించిన మార్కొండ ఫకీర్ నాయుడు, జట్టు ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ డి.పారినాయుడు, సంతోషపురం సర్పంచ్ అంబటి తవిటి నాయుడు, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు అక్కేన మధుసూదనరావు, అంబటి రాంబాబు, సంతోషపురం ఎంపి టిసి, సిబ్బంది గంట శ్రీధర్ నాయుడు, మార్కొండ మురళీకృష్ణమూర్తి నాయుడు పాల్గొన్నారు.



గడ్డిపడ్డ కాలువకు మరమ్మతులు చేపడుతున్న అధికారులు

అప్పుడు నిర్లక్ష్యం... ఇప్పుడు హెచ్చరికలు

జంఝావతి కెనాల్ అధికారుల తీరుపై రైతులు ఆవేదన

ప్రజాశక్తి - కొమరాడ

జంఝావతి కెనాల్ ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం 'చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు' చందంగా ఉందని మండల ప్రజలు నుంచి ఆరోపణ వినిపిస్తున్నాయి. జంఝావతి ఎడమ కాలువ ద్వారా 6ఎల్ కాలువ నుంచి గుణానుపురం వెళ్లే కాలువ వద్ద లీకులు వచ్చినట్లు అధికారులు గురువారం గుర్తించారు. ఆ లీకులను కప్పేందుకు జెసిబితో తవ్వకాలు చేసి మరమ్మతు పనులు చేస్తున్నారు. ఈ కాలువ గట్టు పైనుంచి నిత్యం భారీ వాహనాలతో పాటు పశువుల రవాణా చేసే బొలెరో వాహనాలు రాకపోకలు సాగించడంతో కాలువ గట్టును పూర్తిగా గోతులమయం చేశారు. దీంతో ఆ గట్టు మొత్తం గోతులు ఏర్పడి పూర్తిగా బలహీన పడిపోయింది. దీంతో ఇప్పటికీ కాలువ నిండుగా నీరు విడుదల చేయడంతో గట్టు గండి పడే అవకాశాలు కూడా స్పష్టంగా కనిపిస్తున్నాయి. అధికారులు కాలువ గట్టును ఎప్పుడూ పరిశీలించకుండా పట్టించుకోకపోవడంతో కాలువ పూర్తిగా గోతులు ఏర్పడి కాలువ గట్టుపై వ్యవసాయం చేయడంతో పూర్తిగా గట్టు బలహీన పడిపోయింది. దీంతో మరికొద్ది రోజులు అధికారులు నిర్లక్ష్యంగా ఉంటే కాలువ గట్టుకు పెద్దగండి పడే అవకాశం ఉంది. ప్రస్తుతం అధికారులు కాలువ గట్టు వద్ద ఉన్న లీకులను ఎలుకలు, ఉడుములు గుల్ల చేశాయని చెప్పుకుంటూ మరమ్మతులు చేపడుతున్నారు. కాలువగట్టుపై పెద్దపెద్ద వాహనాలు రాకపోకల వల్ల గోతులు ఏర్పడి గట్టు బలహీనపడిన విషయం అందరికీ తెలిసినప్పటికీ ఆ విషయాన్ని బయటకు చెప్పకుండా ఎలుకలు కన్నాలు పెటాయని, దానివల్లే లీకలు వస్తున్నాయని ఇంజినీరింగ్ అధికారులు చెప్పడం విడ్డూరం. ఈ కాలువకు గండి ఏర్పడితే వందలాది ఎకరాల పంట నీట మునిగిపోయే అవకాశం ఉంది. ఇప్పటికైనా ఇంజినీరింగ్ అధికారులు స్పందించి కాలువ గట్టపై వాహనాల రాకపోకలను నిషేధించాలని రైతన్నలు కోరుతున్నారు.



విద్యార్థులకు ఆరోగ్య పరిరక్షణపై అలవగాహన కల్పిస్తున్న ఆర్‌బిఎస్‌జిల్లా అధికారి జగన్మోహనరావు

సమగ్రంగా ఆరోగ్య సర్వే

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ఆరోగ్య సర్వేలు, హెల్త్ స్క్రీనింగ్‌లు సమగ్రంగా నిర్వహించాలని, బాలల ఆరోగ్య నివేదికలు ఎప్పటికప్పుడు విశ్లేషణ చేసి వారి ఆరోగ్య శ్రేయస్సుకు సమిష్టి కృషి చేయాలని రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమ జిల్లా అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు స్పష్టం చేశారు. మండలంలోని నందివానివలస, తోటపల్లిలో శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించి పిల్లల ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణ తీరు పరిశీలించారు. ముందుగా టీకా కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి వివరాలు స్పష్టంగా ఉండాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. వ్యాక్సిన్ వయల్స్ గమనించారు. పోర్టల్‌లో నమోదుపై ఆరా తీశారు. అంగన్వాడీ కేంద్రంలో చిన్నారుల ఆరోగ్య, ఎదుగుదల నివేదికల రికార్డులు తనిఖీ చేసి అసంతృప్తి వ్యక్తం చేశారు. బరువు, శారీరక ఎత్తు, స్థితి, మార్పు కొలతల నివేదికలు సమగ్రంగా ఉండాలని ఆదేశించారు. చిన్నారుల ఆరోగ్య పరిశీలన చేశారు. గ్రామస్తులతో మాట్లాడి సంచార చికిత్స వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. దీర్ఘకాలిక రోగుల ఆరోగ్యం మెరుగు పడేలా పర్యవేక్షణ ఉండాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఎన్‌సిడి సర్వేపై ఆరా తీశారు. గ్రామంలో డ్రైడే నిర్వహణ తీరుపై, విసిహెచ్ యాప్ పరిశీలించారు. అనంతరం తోటపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయ, వైద్య సిబ్బందితో విద్యార్థుల హెల్త్ స్క్రీనింగ్‌పై సమీక్షించారు. ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రల(నీలి రంగు) లభ్యతను తెలుసుకున్నారు. రక్తహీనతతో ఎంత మంది విద్యార్థులు ఉన్నారు, నివారణా చర్యలపై ఆరా తీశారు. విద్యార్థులకు పలు ఆరోగ్య అంశాలపై ఐఇసి ప్రదర్శిస్తూ జగన్మోహన్ అవగాహన కల్పించారు. అలాగే పరిశుభ్రత, ఆరోగ్య అంశాల పట్ల విద్యార్థుల పరిజ్ఞానాన్ని గమనించారు. వైద్య, అంగన్వాడీ, పాఠశాల సిబ్బంది సమన్వయంతో ఉంటూ చిన్నారులు, విద్యార్థుల ఆరోగ్యంపై పర్యవేక్షణ ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎఎంఒ సూర్యనారాయణ, హెచ్‌ఎం జె.ప్రపూర్ణకుమారి, హెల్త్ సూపర్వైజర్ ఎం.సన్యాసమ్మ, వైద్య సిబ్బంది శ్రావణి, పద్మావతి, ఉపాధ్యాయ, అంగన్వాడీ, వైద్య సిబ్బంది ఉన్నారు.

విచారణకు జోలపాట... అక్రమాలకు ఈలపాట



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

'ఔను...! అధికార యంత్రాంగం పనితీరు విచారణకు జోలపాట... అవినీతి, అక్రమాలకు ఈలపాట పాడుతున్నారు' అంటూ పార్వతీపురం జిల్లా వాసులు కోడై కూస్తున్నారు. పార్వతీపురం పట్టణ నడిబొడ్డున రూ.కోట్లు విలువ చేసే వరహాలు గెడ్డను ఆక్రమించినా స్పందించకపోవడమే ఇందుకు నిర్శనంగా చెప్తున్నారు. ఆక్రమణ దారులతో అధికారులు కుమ్మక్కైయ్యారని కూడా కొందరి నోట అనుమానాలు వినిపిస్తున్నాయి. పట్టణానికి చెందిన ఓ వ్యాపారికి సర్వే నెంబర్ 411లో 400 గజాల జిరాయితీ స్థలం ఉంది. దీనికి ఆనుకునివున్న సర్వే నెంబర్ 410లో 800 గజాల భూమి గెడ్డపోరంబోకుగా రికార్డులో ఉంది. ఈ స్థలంపై కన్నేసిన వ్యాపారి నియోజకవర్గ ముఖ్యనేతను సంప్రదించి డీల్ కుదుర్చుకున్నారు. పథకం ప్రకారం జిరాయితీ స్థలం, ప్రభుత్వ గెడ్డ పోరంబోకు భూమి కలిపి మొత్తం 1200 గజాల స్థలాన్ని కొద్ది రోజుల క్రితం రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. సుమారు రూ.18కోట్ల విలువ చేసే ఈ ప్రభుత్వ భూమి విక్రయంలో నియోజకవర్గానికి చెందిన ఓ కీలకనేత అండదండలు పుష్కలంగా ఉన్నాయనే చర్చ ముమ్మరంగానే సాగుతోంది. ఈ వ్యవహారంలో ఆ ముఖ్యనేతకు రూ.2కోట్లు మేర ముడుపులు అందాయనే ప్రచారం జరుగుతోంది. ఈ విషయం పార్వతీపురం పట్టణంతో పాటు మన్యం జిల్లా వ్యాప్తంగా దావణంలా పాకింది. ఎక్కడ విన్నా ఇదే చర్చ. గతంలో అవినీతిపరుల భరతం పడతానంటూ ప్రగల్భాలాలు పలికిన ఆ నేత ఇప్పుడు అదే ఊబిలో కూరుకుపోతున్నారనే విమర్శలు ఊపందుకున్నాయి. మరోవైపు ప్రభుత్వ భూమి ఆక్రమణపై సమగ్ర సర్వేచేపట్టి, కబ్జాదారుడిపై చర్యలు తీసుకోవాలంటూ సిపిఎం నాయకులు ఇటీవల అధికారులను కలిసి వినతి పత్రం కూడా ఇచ్చారు. అయినప్పటికీ మీనమేషాలు లెక్కిస్తుం డడంతో నిన్నమొన్నటి వరకు అధికారులపై ఉన్న అనుమానాలను ఇప్పుడిప్పుడే బలంగా మారతున్నాయి. ఇదొక్కటే కాదు... పార్వతీపురం నియోజకవర్గంలో ఇటీవల కాలంలో చాలా వరకు ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురయ్యాయి. కొంతమంది ఉద్యోగుల మెడిపై కత్తిపెట్టడంతో ఇక్కడి నుంచి పలువురు బదిలీపై వెళ్లిపోయారు. మరికొందరు దిగువ స్థాయి అధికారులు నలిగిపోతున్నారు. జిల్లాలోని మరో నేతకు ఏకంగా అధికారులే దండిగా డబ్బులు ఇవ్వాలట. లేకుంటే బదిలీ వేటేనట. ఇదంతా పలు శాఖల్లో జరుగుతున్న వ్యవహారం. ఇంత జరుగతున్నా ఉన్నతాధికారులు స్పందించకపోవడం పట్ల పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తుండగా, ఆ నేత చేతిలో కీలుబొమ్మగా మారిపోయారంటూ మరికొందరు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తెలిసీ తెలియనట్టుగా వ్యవహరించడం మానేయకపోతే లోకాయుక్త జోక్యం తప్పదంటూ పబ్లిక్ చర్చనడుస్తోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే మరిన్ని ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యే ప్రమాదం ఉంది.



కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న సిపిఎం బృందం

యథేచ్ఛగా ప్రభుత్వ భూములు కబ్జాలు

సర్కారు భూములకు రక్షణ కల్పించాలి

ఆక్రమిత స్థలంలోని కంచెను తొలగించాలి : సిపిఎం

ప్రజాశక్తి - బలిజిపేట

స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న మెట్టకాలనీలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నారు. మెట్టకాలనీని ఆక్రమించి వేసిన కంచెను, ఇళ్ల స్థలాలను సిపిఎం బృందం శనివారం పరిశీలించింది. ఈసందర్భంగా సిపిఎం నాయకులు గేదెల సత్యనారాయణ, బొద్దాన భానుమూర్తి, యమ్మల మన్మథరావు మాట్లాడుతూ పలగార రెవెన్యూ బలిజిపేటలో మెట్ట కాలనీలో సర్వే నంబర్ 32 /2లో కొంతమంది ప్రభుత్వ భూమి రాయి మెట్ట చుట్టూ కంచె వేశారన్నారు. గతంలో ఈ మెట్టపై మంచినీళ్ల ట్యాంకు కట్టాలని అప్పటి రెవెన్యూ అధికారులు, ప్రభుత్వం పెద్దలు నిర్ణయించారన్నారు. అయితే కానీ మెట్టకాలనీలో యథేచ్ఛగా ఆక్రమాలు జరుగుతూ ఒక్కొక్కరు ఇళ్లు కట్టుకోగా ప్రభుత్వ భూమికి చుట్టూ కంచెలు, ప్రహరీ గోడలు కడుతున్నారన్నారు. ప్రజా అవసరాల కోసం ఉపయోగించాల్సిన ప్రభుత్వ మెట్ట భూమిని కొంతమంది స్వార్ధపరులు కాసులకు కక్కుర్తిపడి ఇలా ఆక్రమణలకు పాల్పడుతున్నారన్నారు. అలాగే మెట్టకాలనీలో కొంతమందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారని, ఆక్రమణదారులు ముళ్ల కంచెలు వేయడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో కాలనీలో ఉన్న ప్రజలు గొడవలు దిగే ప్రమాదం ఉందని, కావున తహశీల్దార్ స్పందించి ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలకి వెళ్లేడానికి దారిచూపి, ప్రభుత్వ భూములకు వేసిన కంచెలను, ప్రహరీ గోడలను తొలగించాలని కోరారు. ఇళ్ల స్థలాల్లేక అనేక మంది నిరుపేదలున్నారని, వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు. లేకుంటే రెవెన్యూ కార్యాలయం ముందు నిరసన తెలుపుతామన్నారు. కార్యక్రమంలో మెట్ట కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

నిర్వాహకులకు కనీస వేతనం చెల్లించాలి

- మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటీకరించే ఆలోచన విరమించుకోవాలి
- స్కూల్‌స్వీపర్లకు గుర్తింపు కార్డులు, పనిముట్లు ఇవ్వాలి
- ఏపి మధ్యాహ్న భోజనం, స్కూల్ స్వీపర్ల యూనియన్, సిఐటియు డిమాండ్


బలిజిపేటలో నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు

ప్రజాశక్తి - బలిజిపేట

మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటీకరించే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని నిర్వాహకులకు కనీసవేతనం చెల్లించాలని, స్కూల్ స్వీపర్లకు గుర్తింపు కార్డులు, పనిముట్లు ఇవ్వాలని ఏపి మధ్యాహ్నభోజనం, స్కూల్ స్వీపర్ల యూనియన్, సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక ఆర్‌బిసి కాంప్లెక్స్ దగ్గర నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, మధ్యాహ్న భోజనం, స్కూల్ స్వీపర్ల యూనియన్ నాయకులు లక్ష్మమ్మ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటీకరించే ప్రయత్నంలో భాగంగా ప్రతి మండలంలో అన్ని పాఠశాలల్లో వంట విధానాన్ని రద్దుచేసి మండలానికి ఒక చోట స్మార్ట్ కిచెన్ పేరుతో సామూహిక వంటశాల నిర్మించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రయత్నిస్తున్నారని, దీన్ని సిఐటియు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. అనేక ఏళ్లుగా మధ్యాహ్న భోజన నిర్వాహకులు సేవా దృక్పథంతో ఈ పథకం నిర్వహిస్తున్నారని, అప్పుల రూపాయలు ముందస్తు పెట్టుబడులు పెట్టి నిర్వహిస్తుంటే వారికి నష్టం చేకూర్చేలా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వీరందరికి కనీస వేతనాలు చెల్లించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం చెల్లించకుండా ఉన్న ఉపాధిని కూడా తీసేయడం అత్యంత నీచమైన చర్యని అన్నారు. ఈ ప్రైవేటీకరణ విధానాన్ని నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా మధ్యాహ్న భోజన నిర్వాహకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఐక్యం చేసి పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు బి.లక్ష్మి, శ్రీదేవి, కళమ్మ, బంగారమ్మ, మజ్జమ్మ, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక సిఐటియు కార్యాలయంలో మధ్యాహ్న భోజనం కార్మిక సంఘం, పాఠశాల శానిటేషన్ కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటీకరించే ప్రభుత్వం మానుకోవాలన్నారు. ఇప్పటికే జిల్లాలు మూడు పట్టణ ప్రాంతాల్లో కేంద్రీకృత వంటశాలలో ఏర్పాటుచేసి పంపిణీ చేయాలన్న ఆలోచన విరమించుకోవాలని, అలాగే మండలంలోని వేలాదిమంది మంది విద్యార్థులకు ఒకే చోట వంటవండి వాహనాల ద్వారా పంపిణీ చేయాలనుకోవడం దుర్మార్గమైన చర్యని విమర్శించారు. గ్రామీణ ప్రాంతంలో ఈ విధానం అమలు చేస్తే పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించి వారి వద్ద నుంచి లక్షల్లో కమిషన్లు తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు చేస్తున్న ప్రయత్నం ఇదని విమర్శించారు. ఈ ప్రైవేటీకరణపై జిల్లా వ్యాప్తంగా మధ్యాహ్న భోజన నిర్వాహకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఐక్యం చేసి పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం మండల నాయకులు, ప్రభుత్వ పాఠశాల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎన్.రోయిభాయి, వి.చామంతి, బి.గౌరమ్మ, టి.అంజలి, బి.నవమి, ఎ.కావ్య, ఎస్.సంతోషి, వి.ప్రశాంతి, బి.రోజామణి, ఎం.అంజలి, ఎస్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మక్కువ : మధ్యాహ్న భోజన కార్మిక సంఘం కార్మికుల సమావేశం మక్కువలో జరిగింది. అనంతరం భోజన నిర్వాహకుల సమస్యలపై ఎంఇఒ కార్యాలయం వద్ద నిరసన ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు, శ్రామిక మహిళ జిల్లా నాయకులు వి.రామలక్ష్మి, మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం జిల్లా కార్యదర్శి శాంత కుమారి మాట్లాడారు. నిర్వాహకులకు కనీస వేతనాలు చెల్లించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం చెల్లించకుండా ఉన్న ఉపాధిని కూడా తీసేయడం అత్యంత నీచమైన చర్యని అన్నారు. ఈ ప్రైవేటీకరణ విధానాన్ని మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం, సిఐటియు వ్యతిరేకిస్తున్నదని, దీనిపై జిల్లా వ్యాప్తంగా మధ్యాహ్న భోజన నిర్వాహకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఐక్యం చేసి పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. అలాగే ఈనెల 23న భోజన నిర్వాహకుల సమస్యలపై మక్కువలో జరిగే కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం మండల నాయకులు జ్యోతి, పార్వతి, రవణమ్మ, లక్ష్మి, సిఐటియు మండల నాయకులు జి.కృష్ణారావు, ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి తాడంగి ప్రభాకరరావు పాల్గొన్నారు.


పువ్వల కుటుంబ కుమారుడితో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

పువ్వల కుటుంబానికి మంత్రి పరామర్శ

ప్రజాశక్తి - సాలూరు

వైసిపి సీనియర్ నాయకులు పువ్వల నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను శనివారం ఎంఎస్ఎంఇ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు పరామర్శించారు. అనారోగ్యంతో ఇటీవల పువ్వల నాగేశ్వరరావు మృతి చెందారు. ఆయన భార్య, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఈశ్వరమ్మను, కుమారుడు శ్రీనివాస్ భరత్ ని మంత్రి శ్రీనివాసరావు ఓదార్చారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు భంజ్ దేవ్‌కు రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు శనివారం పరామర్శించారు. భంజ్ దేవ్ కొద్ది రోజుల క్రితం మోకాలికి శస్త్ర చికిత్స చేయించుకొని విశ్రాంతిలో ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి శ్రీనివాసరావు ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. శనివారం సాయంత్రం మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర కూడా భంజ్ దేవ్‌ను పరామర్శించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి : సిపిఎం

ప్రజాశక్తి - కొమరాడ

ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేసి రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేయాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని సివిని వద్ద రైతులు ఆరబోసిన కళ్లాల వద్ద ఉన్న ధాన్యాన్ని శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కనీస మద్దతు ధరకు మీ సేవ కేంద్రాల ద్వారా వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. అలాగే 24 గంటల్లో రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు జమ చేయాలన్నారు. ఇదిలా ఉండగా, కొన్ని రైతు సేవ కేంద్రాల్లో కాళీ బస్తాలు, కళాసీలను ఏర్పాటు చేయలేదన్నారు. కావున అధికారులు స్పందించి కాళీ బస్తాలు అందజేసి, తేమ, పొడి ధాన్యం కొనుగోలు చేసి రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు.


ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురంలో ప్రజా దర్బార్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రజా దర్బార్‌కు ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందని, ప్రజల నుంచి వస్తున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వెంటనే పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. గుమ్మలక్ష్మీపురంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం శనివారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి 5మండలాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి తమ సమస్యలను విన్నవించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యను పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.

65 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం వైద్యాధికారి బి.ప్రదీప్‌కుమార్ 65 మంది గర్భిణులకు వైద్య తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా రక్త నమూనాలు, బరువు, ఎత్తు, మధుమేహ, రక్తపోటు, తదితరమైన వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన గర్భిణీలకు భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు ఒ.శాంతికుమారి, సుభార్తామణి, ఆదిలక్ష్మి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.

పాఠశాల భవనాలు పూర్తి చేయండి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియ్యమ్మవలస మండలంలోని చినతోలుమండగూడ, నిడగల్లుగూడ, పెదదొడిజ గ్రామాల్లో నిలిచిపోయిన గిరిజన సంక్షేమ పాఠశాలల భవనాలు పూర్తి చేయాలని గిరిజన అభ్యుదయ సంఘం అధ్యక్షులు ఆరిక చంద్రశేఖర్ అధికారులను కోరారు. సర్వ శిక్ష అభియాన్ నిధులతో పాఠశాల అదనపు భవనాలు మంజూరయ్యాయని, వీటి నిర్మాణాలకు ముందుగానే కొంత అడ్వాన్ పేమెంట్ విడుదల చేయడం జరిగిందన్నారు. వచ్చిన నిధులతో కొంత వరకు పనులు చేశారన్నారు. మిగతా పనుల నిమిత్తం డబ్బులు విడుదల చేయకపోవడంతో ఆ భవనాలు అసంపూర్తిగా మిగిలిపోయాయని తెలిపారు. పనుల కోసం నిధులు విడుదల చేసి పాఠశాల భవనాలను పూర్తి చేయాలని కోరారు.


జగదీశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పుష్పశ్రీవాణి

పలువురికి పుష్పశ్రీవాణి పరామర్శ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ సభ్యులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గంట జగదీశ్వరరావు కుటుంబ సభ్యులను మాజీ డిప్యూటీ సిఎం పాముల పుష్పశ్రీవాణి శనివారం సాయంత్రం పరామర్శించారు. అలాగే తుంబలి సత్తిబాబు తల్లి మృతి చెందిన విషయం తెలుసుకొని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఓదార్చారు. అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో గుమ్మలక్ష్మీపురం, కురుపాం ఎంపిపిలు దీనమయ్య, పద్మావతి, నాయకులు ఉన్నారు.

నడిమికెల్లలో ప్రత్యేక వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని నడిమికెల్లలో శనివారం స్థానిక వైద్యాధికారి ఎం.సాయికుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, గర్భిణీలు, మధుమేహ, రక్తపోటు, తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు, రోగులు, పాల్గొన్నారు.

16న సొండి కులస్తుల విస్తృత స్థాయి సమావేశం

ప్రజాశక్తి -భామిని

విజయనగరం జిల్లా దుప్పాడలోని టిపిఆర్ స్విమ్మింగ్ పూల్ ఆవరణలో రాష్ట్ర సొండు కుల సంఘం విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం ఈనెల 16న జరుగుతుందని, ఈ సమావేశానికి సీతంపేట, భామిని మండలంలోని సొండి కులస్తులు పెద్ద ఎత్తున రావాలని సొండి కులస్తులు ఐక్య సంఘం మండల అధ్యక్షులు లాభాల మురళి, బంగారం బండి జనార్ధన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్రస్థాయి సొండి కుల నాయకులు పాల్గొంటారని, సొండి కులస్తుల భవిష్యత్ కార్యచరణ, రిజిస్ట్రేషన్ ప్రక్రియ, రాష్ట్రస్థాయిలో సొండి కులస్తుల గణన అంశాలు, సొండి కులస్తులు ఒబిసి సాధన అంశాలపై చర్చిస్తారని తెలిపారు. క్షేత్రస్థాయిలో మండల కమిటీలు కార్యచరణ అంశాలను వివరిస్తారని, రాష్ట్రస్థాయిలో సొండి కులస్తుల సంక్షేమానికి చేపట్టాల్సిన అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహిస్తారని తెలిపారు.

12న వైసిపి ప్రజా ఉద్యమం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరిస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైసిపి ఆధ్వర్యంలో ఈనెల 12న ప్రజా ఉద్యమం పేరిట పార్వతీపురంలో నిరసన, ర్యాలీలు నిర్వహించనున్నట్టు మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. ర్యాలీ అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేస్తామన్నారు. ఇందుకు సంబంధించి శనివారం జోగారావు క్యాంప్ కార్యాలయంలో "వైసిపి ప్రజా ఉద్యమం" పోస్టర్‌ను ఆయన నియోజకవర్గ వైసిపి నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేదాకా వైసిపి పోరాడుతుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అందరికీ నాణ్యమైన ఉచిత వైద్యం అందించడం ప్రభుత్వ బాధ్యతగా భావించిన నాటి సిఎం వైఎస్ జగన్ రాష్ట్ర వ్యాప్తంగా 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుట్టి, 7 కాలేజీలను పూర్తి చేశామన్నారు. మిగిలిన కాలేజీల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఈ మెడికల్ కాలేజీలు, ఆస్పత్రుల నిర్మాణాలకు నిధుల కొరత లేకుండా సెంట్రల్ స్పాన్సర్డ్ స్కీమ్స్‌తో టైఅప్ చేయడం జరిగింది. కానీ 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మెడికల్ కాలేజీ నిర్మాణాలను పూర్తిచేయకపోగా సేఫ్ క్లోజర్ పేరుతో పూర్తిగా పక్కన పెట్టేశారన్నారు. అంతేకాకుండా 10 మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయాలని నిర్ణయించి డాక్టర్లు కావాలని కలలు కనే పేద విద్యార్థుల ఆశలకు చంద్రబాబు గండి కొట్టారని విమర్శించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్ ఆదేశాలతో పార్వతీపురం నియోజకవర్గంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈనెల 12న స్థానిక విగ్రహం వద్ద నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించడం జరుగుతుంది అని ఆయన తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణలో జిల్లా వైసిపి ప్రధాన కార్యదర్శి పోల సత్యనారాయణ, పట్టణ, మండల అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, బొమ్మి రమేష్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు సర్విశెట్టి శ్రీనివాసరావు, జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షులు పాత గౌరీశంకర్రావు, రాష్ట్ర, నియోజకవర్గ వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు బంకురి రవికుమార్, సిద్దా జగన్నాథం, బలగ నాగేశ్వరరావు, దేవుపల్లి నాగరాజు, కౌన్సిలర్లు, సర్పంచ్లు, సీనియర్ నాయకులు వేంపలి గురురాజు, సువ్వాడ లావణ్య, వండానా నేతాజీ, పెండ రమణ, చెరుకుపల్లి గంగరాజు, బూర సూర్యనారాయణ), బి.తిరుపతిరావు, చింతాడ శైలజ, మండల త్రినాథ, యాళ్ళ పారి నాయుడు, ఏగిరెడ్డి గోపాల్ నాయుడు, బి.నాగరాజు, కోరాడ చిట్టి,సొండీ నారాయణరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రజా ఉద్యమ ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

ప్రభుత్వ పాఠశాలలో వైద్య శిబిరం

'ముస్తాబు' విజేతలకు కలెక్టర్ అభినందన

ప్రజాశక్తి - పాచిపెంట


వైద్య శిబిరం ఏర్పాట్లును పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

విద్యార్థుల పరిశుభ్రత, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్ ప్రభాకర రెడ్డి అన్నారు. మండలంలోని సురగడ వలసలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను శనివారం సందర్శించారు. పాఠశాల ఆవరణలో 104 ఆధ్వర్యంలో మెడికల్ సిబ్బందిచే ప్రత్యేక ఆరోగ్య శిబిరం నిర్వహణ ఏర్పాట్లుపై ఆరాతీశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముస్తాబు కార్యక్రమంపై పిల్లలకు అవగాహన కల్పించి, ఉపాధ్యాయుల ముస్తాబు నిర్వహణపై పూర్తి అవగాహన అవసరమన్నారు. ముస్తాబు కార్యక్రమం ద్వారా పిల్లలకు పరిశుభ్రతపై మంచి అవగాహన కలుగుతుందన్నారు. అలాగే గ్రామానికి చెందిన 104 మెడికల్ సిబ్బందితో మాట్లాడి స్థానిక ప్రజల ఆరోగ్య వివరాలు, నమోదైన కేసుల వివరాలపై అలాగే పరిశుభ్రత, ముస్తాబు కార్యక్రమంపై కలెక్టర్ ఆరా తీశారు. అదే పాఠశాలలో ఆరో తరగతి చదువుచున్న విద్యార్థికి కంటి చూపు లోపం ఉన్నట్లు కలెక్టర్ దృష్టికి వచ్చింది.

దీనిపై తక్షణమే స్పందించిన కలెక్టర్, 104 మెడికల్ సిబ్బందికి ఆ విద్యార్థికి వెంటనే కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో పాఠశాలలో ముస్తాబు విజేతలకు జిల్లా కలెక్టర్ అభినందనలు తెలిపారు.


పార్వతీపురం-బొబ్బిలి జాతీయ రహదారిపై ఏర్పడ్డ గోతులు

ఎక్కడికక్కడే గోతులు

ప్రమాదాలు జరిగినా పట్టని అధికారులు

ప్రజాశక్తి - సీతానగరం

బొబ్బిలి నుంచి పార్వతీపురం మధ్య గల జాతీయ రహదారిపై ఎక్కడికక్కడ పెద్దపెద్ద గొయ్యిలు దర్శనమిస్తున్నాయి. ఈ జాతీయ రహదారిపై పాత బొబ్బిలి నుంచి లచ్చపేట, కాశీపేట నుంచి చినబోగిలి మధ్యలోని చినబోగిలి రైల్వే ట్రాక్ నుంచి సీతానగరం బ్రిడ్జి వరకు ఎక్కడ్కిడ గోతులు ఏర్పడ్డాయి. అలాగే అక్కయ్యపేట నుంచి జోగింపేట, జోగింపేట నుంచి గుచ్చిమి రోడ్డులో కూడా గోతులు ఉన్నాయి. ఇలా పార్వతీపురం వరకూ ఎక్కడికక్కడే గోతులు కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు సీతానగరం వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జిపై గత రెండేళ్లు ఐదు ప్రమాదాలు జరగ్గా, అక్కడికక్కడే వాహనదారులు మరణించిన సంఘటనలు ఉన్నాయి. అయినప్పటికీ ఆర్ అండ్ బి అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకోకుండా నమ్మకునీరెత్తినట్లే వ్యవహరిస్తున్నారన్న విమర్శలు విన్పిస్తున్నాయి. పాలకుల నిర్లక్ష్యం వల్ల ప్రజల ప్రయాణాలు గాల్లోకి కలిసిపోతున్నప్పటికీ ఎటువంటి చర్యలు లేకుండా అలాగే ఉంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్ అండ్ బి అధికారులు ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రం రోడ్డు మరమ్మతు పనులు చేస్తామని చెప్పడం తప్ప ఎక్కడ ఏ పనులు చేయడంలేదు. గత నెలలో ఫ్లైఓవర్ మీద అప్పయ్యపేట గ్రామానికి చెందిన సుధాకర్ మరణించినా ఇప్పటి వరకు ఎటువంటి మరమ్మతు పనులు చేయకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అంతే కాకుండా ఫ్లైఓవర్ బ్రిడ్జిపై గత నాలుగేళ్లగా వీధిలైట్లు లేకపోవడంతో గోతులు కనబడక ఆ గోతుల్లో వాహనదారులు పడిపోయి మరణించిన సంఘటనలు కోకొల్లుగా ఉన్నాయి. ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు ఫిర్యాదులు చేసినప్పటికీ ఎటువంటి ప్రయోజనం లేకపోవడంతో ఇక్కడ ప్రమాదాలుగా నిలయాలుగా మారిపోయాయి. ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికార యంత్రాంగం స్పందించి రోడ్లు మరమ్మతు పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాలు

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి -వీరఘట్టం

మండల కేంద్రంలోని వట్టిగెడ్డలో ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. వంతెన, రక్షిత మంచినీటి పథకాలకు 500 మీటర్ల దూరంలో ఇసుక తవ్వకాలు జరుపుకోవచ్చునని నిబంధనలు ఉన్నప్పటికీ ఆ నిబంధనలను గాలికి వదిలేసి ఇష్టానుసారంగా తవ్వకాలు జరిపి సొమ్ము చేసుకుంటున్నారు. సమీపంలోనే తహశీల్దార్ కార్యాలయం ఉన్నప్పటికీ నిబంధనకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు చేపడుతున్న వారిపై కనీసం చర్యలు కూడా తీసుకోవడం లేదన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఈ తవ్వకాల వల్ల ఒట్టిగెడ్డలో పడి అనేక ప్రాణాలు గాలిలో కలిసిపోయే సంఘటనలో కోకొల్లలు. రోజూ పదుల సంఖ్యలో నాటు బల్లుతో ఇసుక తవ్వకాలు జరిపి తహశీల్దార్ కార్యాలయం ఎదురుగానే ట్రాక్టర్లకు డంపు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ అధికారులు చూసీపడనట్టు వ్యవహరిస్తున్నారు. ఇలాగే జరిగే రానున్న వేసవికి రక్షిత మంచినీటి పథకాలు నీళ్లు పరిస్థితి ఉండదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే వంతెనకు ప్రమాదం వాటిల్లే పరిస్థితి నెలకొంటుందన్నారు. కావున అధికారులు స్పందించి అక్రమ ఇసుక తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.


వట్టిగెడ్డలో నాటుబళ్లతో తరలిస్తున్న ఇసుక

పత్తి పంట పునరుద్ధరణ ప్రయోగం

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలో కూనం బందంవలసలో పత్తి పంట పునరుద్ధరణ ప్రయోగం కార్యక్రమం శనివారం నిర్వహించారు. సుమారు నాలుగువేల ఎకరాలకు పైగా పత్తి పంట ఉందని, నీటి సదుపాయం ఉన్న రైతులు పత్తి తీసివేసి మొక్కజొన్న సాగుకు సిద్ధం చేస్తున్నారని, అయితే ఇటీవల కురిసిన వర్షపు నీరు ఇంకా కొన్ని రోజులు నేలలో తేమను నిల్వపుతుందని పత్తి పంటను కొనసాగించే రైతులు కొన్ని ప్రకతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పత్తి మళ్లీ చిగురించేలా చేసి మంచి దిగుబడిని పొందేలా ఒక ప్రయోగాన్ని రైతులు అధికార్ల కృష్ణ, మహిళా రైతు దేవి పత్తి క్షేత్రాల్లో చేస్తున్నామని వ్యవసాయ అధికారి కె తిరుపతిరావు అన్నారు. ముందుగా పేడ మూత్రం, ఇంగువ ద్రావణం పిచికారీ చేసిన తర్వాత పంచగవ్యంపై దశ పత్ర కషాయం మీనామృతం మళ్లీ పంచగవ్య వారం వ్యవధిలో పిచికారి చేసినట్లయితే రసం పీల్చు పురుగులు నివారించబడి పంచగవ్య మీనామృతం పిచికారీ ద్వారా కొత్త చిగుర్లు వచ్చే అవకాశం ఉందని అలాగే వచ్చే పత్తి కూడా నాణ్యమైంగా ఉంటుందని భావించి ఈ ప్రయోగాన్ని మండలంలో ఆరుగురు రైతుల క్షేత్రాలలో జరుపుతామని తెలిపారు. ఈ ప్రయోగం సఫలమైతే పత్తి పంటను జనవరి వరకు కొనసాగించే రైతులకు మేలుగా ఉంటుందని తెలిపారు. అనంతరం చెరుకుపల్లిలో వరి పంటను పరిశీలించారు. ప్రస్తుతం వరి పంటకు కంకినల్లి ఆశించిందని, దానివల్ల కంకిలో కొన్ని గింజలు పాలు పోసుకోవడం లేదని, దీని నివారణకు ప్రోఫినోపాస్, ప్రాఫికొన్నజోల్ మందుతో కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి విజయ్, ఐసిఆర్‌పి కుమార్, రైతులు పాల్గొన్నారు

మహిళల రక్షణకు శక్తి యాప్

ప్రజాశక్తి -కొమరాడ

ఆపద సమయాల్లో మహిళల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన శక్తి యాప్ గురించి విస్తృత అవగాహన కల్పిస్తున్నట్లు శక్తి టీం ఎఎస్ఐ ఎల్.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని విక్రాంపురం జిల్లా పరిషత్ హైస్కూల్లో శక్తి టీం సభ్యులు విద్యార్థినులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళ తమ ఫోన్‌లో శక్తి యాప్‌ను డౌనలోడ్ చేసుకుని, పోలీసుల సాయం పొందేలా చైతన్య పరుస్తున్నట్లు తెలిపారు. ఈ యాప్ ద్వారా హింసాత్మక ఘటనల నుంచి మహిళలు రక్షణ పొందవచ్చున్నారు. ఏదైనా ప్రమాదం తలెత్తితే యాప్ ఓపెన్ చేసి ఎస్ఓఎస్ బటన్‌ను నొక్కితే.. బాధితులు ఉన్న లోకొషన్‌ను పోలీసులు గుర్తించి, తక్షణమే స్పందిస్తారని తెలిపారు. ఈ బృందాలు జిల్లాలోని కళాశాలలు, పార్కులు, ఆర్టీసీ బస్టాండ్లు, ముఖ్య కూడళ్లలో మఫ్టీలో నిఘా వేస్తాయని తెలిపారు. మహిళలను వేధించే ఆకతాయిలను గుర్తించి, వారిపై చట్టపరమైన చర్యలు చేపడతారని అన్నారు. ఆపద సమయంలో శక్తి యాప్‌కు వచ్చే ఎస్ఓఎస్, డయల్ 112/100 కాల్స్‌తో సంఘటనా స్థలానికి ఈ టీమ్‌లు వెళ్తాయని తెలిపారు. కాల్స్ వచ్చిన వెంటనే శక్తి బృందాలు అప్రమత్తమై, సంఘటనా స్థలానికి చేరుకోవాలని, సమస్యను చట్టబద్ధంగా పరిష్కారమయ్యేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శక్తి యాప్ డౌన్లోడ్ అండ్ రిజిస్ట్రేషన్, శక్తి యాప్‌లో ఉండే 11 ఫ్యూచర్స్, ఉపయోగాలు శక్తి యాప్ టోల్ ఫ్రీ నెంబర్ 112, మహిళలు రక్షణ చట్టం, గుడ్ అండ్ బాటచ్ , పోక్సో యాక్ట్, సైబర్ క్రైమ్ 1930, డ్రగ్స్ 1972 , ఈగల్ మరియు బాల్య వివాహం 1098, ఆన్‌లైన్ మోసాలు మొదలగు జాగ్రత్తలు లు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శక్తి బృందం సభ్యులు హెచ్‌సి గురుమూర్తి , మహిళా పోలీస్ కానిస్టేబుల్ రామలక్ష్మి, పద్మ పాల్గొన్నారు.

అడవి పంది దాడిలో గిరిజన రైతుకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని జి.శివడలో గిరిజన రైతుపై అడవి పంది దాడి చేయడంతో తీవ్ర గాయాలైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం పాలక మాడుగు అనే గిరిజనుడు తన కొండ వద్ద కొండపోడు వ్యవసాయం చేస్తుండగా అడవిపంది ఒక్కసారి వచ్చి దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడ్ని భద్రగిరి ఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్య సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం కేంద్రాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స అందిస్తున్నారు. ఇదిలా ఉండగా, అటవీశాఖాధికారులు స్పందించి అడవి పందులను సంచారానికి అడ్డుకట్టవేయాలని ఈ ప్రాంత గిరిజనులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా మారిన గండి

ప్రజాశక్తి - వీరఘట్టం


కల్వర్టు వద్ద ఏర్పడిన గండి

మండలంలోని హుస్సేన్ పురం, నీలంపేట గ్రామాల మధ్య రహదారికి ఆనుకొని ఉన్న కల్వర్టుకు గండిపడడంతో ప్రమాదకరంగా మారిందని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2019లో రూ.4.60 కోట్లతో హుస్సేన్‌పురం సమీపాన తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ సెవెంత్ బ్రాంచ్ నుంచి హుస్సేన్ పురం మీదుగా నీలం పేట, ఎలిసిపురం, సంధిమానుగూడ వరకు అప్పట్లో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. అయితే ఏళ్లు గడుస్తున్నప్పటికీ రహదారి పనులు పూర్తి కాకపోవడంతో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నామని, అంతేకాకుండా పనుల్లో నాణ్యతా ప్రమాణాలు లేకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు కల్వర్టు వద్ద గండ్లు కొడుతున్నాయని, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గండి పూడ్చడంతో పాటు అర్ధాంతరంగా నిలిచిపోయిన రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని హడ్డుబంగి సమీపాన ద్విచక్ర వాహనం, ఆటో ఢీకొనడంతో ఒకరికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే కొత్తూరు నుంచి చింతాడకు చెందిన రామారావు ద్విచక్ర వాహనంపై వస్తుండగా అదే సమయంలో సీతంపేట నుంచి ఆటో కొత్తూరు వైపు వెళ్తుండగా ఆటో ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో రామారావుకు గాయాలయ్యాయి. వెంటనే సీతంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. సీతంపేట ఎస్సై వై అమ్మనరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.